సాక్షి
విజయనగరం
గురువారం । 24 । అక్టోబర్ । 2024



తిన్నది కక్కాల్సిందే..!

ఉపాధిహామీ పథకంలో అక్రమాలపై అధికారులు నిగ్గుతేల్చుతున్నారు. జేబుల్లో వేసుకున్న నిధులను రికవరీ చేస్తున్నారు. - 8లో



అకారణంగా అర్ధరాత్రి తిరిగితే కేసులు

సహేతుకమైన కారణం లేకుండా అర్ధరాత్రి వేళ పట్టణాల్లో తిరిగితే టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదుచేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. - 8లో



'అపార్'లో నమోదు తప్పనిసరి

జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాల విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదు చేయాలని ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా జ్యోతిర్మయి



ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా జ్యోతిర్మయి ఎన్నికయ్యారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జిల్లా రిజిస్ట్రార్ షేక్ రిజ్వాన్ వ్యవహరించారు. ఎన్నికై న వారికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు ఎన్నిక ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా భీమేష్, ట్రెజరర్‌గా విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా చంద్రసాయి ఎన్నికయ్యారు.

నేడు జిల్లాకు హోం మంత్రి రాక

- గుర్లను సందర్శించనున్న మంత్రి

విజయనగరం అర్బన్: రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత జిల్లాలో గురువారం పర్యటించనున్నట్టు కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వెల్లడించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు నగరానికి చేరుకొని మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు నివాసానికి వెళ్తారని, అక్కడ నుంచి జెడ్పీ అతిథిగృహానికి చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3.20 గంటలకు కలెక్టర్ కార్యాలయం చేరుకొని గ్రామీణ నీటి సరఫరా, వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు అధికారులతో పలు అభివృద్ధి అంశాలపై సమీక్షిస్తారన్నారు. సాయంత్రం ఐదున్నర గంటలకు అనకాపల్లి జిల్లా సబ్బవరం బయలుదేరి వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

జీఎన్ఎం కోర్సులో ప్రవేశాలు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రి బొల్లినేని మెడిస్కిల్స్‌లో హెల్త్‌కేర్ రంగానికి సంబంధించి జీఎన్ఎం కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వరకూ అడ్మిషన్లకు అవకాశం ఉందని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన తర్వాత, ఉద్యోగంలో జాయినింగ్ అయ్యాక ఫీజు కట్టుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని చెప్పారు. పూర్తి వివరాలకు 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రాష్ట్ర పోటీలకు అబ్జర్వర్‌గా శ్రీరాములు



శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణానికి చెందిన డాక్టర్ పి.శ్రీరాములు మరోమారు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అబ్జర్వర్‌గా ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా మల్కిపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ బ్యాడ్మింటన్ అండర్-14, 17 పోటీలకు అబ్జర్వర్‌గా వ్యవహరిస్తారని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పేర్కొంది. ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీగా పనిచేస్తున్న శ్రీరాములు భారత్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ గ్రేడ్-1 అంపైర్‌గా గతంలో పలు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు అంపైర్‌గా పనిచేశారు. 2010లో న్యూఢిల్లీలో నిర్వహించిన కామన్వెల్త్ క్రీడలకు టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించారు. మరోసారి అవకాశం రావడంపై బ్యాడ్మింటన్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు 'బాబూ'!



బస్సులో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టిన డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్

విజయనగరం ఫోర్ట్: అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతోంది.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు కల్పిస్తారని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని నెరవేర్చాలని కోరుతూ బుధవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసరావు, షరీఫ్, కరీమ్, రెహమాన్, చంద్రశేఖర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

దానాపై అలెర్ట్..!



- తీర గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ అంబేడ్కర్
- అప్రమత్తంగా ఉండాలని సూచన



చింతపల్లి తీరంలో స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్, అధికారులు

పూసపాటిరేగ: బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్‌పై సముద్రతీర గ్రామాల ప్రజలను కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అప్రమత్తం చేశారు. పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి గ్రామాన్ని బుధవారం సందర్శించారు. తీరంలో బలమైన గాలులతో కూడిన భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, మత్స్యకారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు చేపలవేటకు వెళ్లవద్దన్నారు. విలువైన వలలు, బోట్లును తీరం నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించి భద్రపరుచుకోవాలని కోరారు. తీరంలోని పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. ట్యాంకుల చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, ఆర్డీఓ దాట్ల కీర్తి, మండల ప్రత్యేక అధికారి జోసఫ్, తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం.రాధిక, డివిజనల్ పంచాయతీ అధికారి మోహనరావు, ఈఓపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, చింతపల్లి సర్పంచ్ బర్రి మొసలి, జిల్లా మత్స్యకారసొసైటీ అధ్యక్షుడు బర్రి చిన అప్పన్న తదితరులు ఉన్నారు.

వద్దు బాబూ.. వద్దు..!



మద్యం దుకాణం ముందు కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న మహిళలు

కాన్వెంట్, చర్చి, జనావాసాల మధ్య ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలంటూ బొబ్బిలి పట్టణంలోని మేదరబందకు చెందిన మహిళలు బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. మద్యం దుకాణం వద్ద కొవ్వొత్తులతో కాసేపు నిరసన ప్రదర్శన చేశారు. దుకాణం ఏర్పాటును అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు దుకాణదారునికి మద్దతుగా మాట్లాడడంపై అభ్యంతరం తెలిపారు. మద్యం దుకాణాల వద్దే అఘాయిత్యాలు జరుగుతున్నాయా.. బడికి, గుడికి అసలు అనుమతులున్నాయా అంటూ తిరిగి మహిళలను కించపరిచేలా మాట్లాడడం సీఐకు తగదన్నారు. గుడి, బడికి దూరంగా మద్యం దుకాణం ఉండాలన్న నిబంధనను విస్మరించారన్నారు. దుకాణాన్ని దూరంగా తరలించేవరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. మహిళలకు ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు మద్దతు తెలిపారు.

– బొబ్బిలి

వణికిస్తున్న డయేరియా!

- అతిసార రోగాన్ని అరికట్టలేక సర్కారు నీరసం
- డయేరియా లేదని చెప్పేందుకు వైద్య శిబిరాల మూత
- గుర్ల విషాదం నుంచి తేరుకోకముందే పొరుగు మండలాల్లో పంజా
- గరివిడి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లో కొత్త కేసులు
- నేడు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాక
- గుర్లలో డయేరియా బాధిత కుటుంబాలకు పరామర్శ

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉమ్మడి విజయనగరం వాసులను డయేరియా వణికిస్తోంది. మృత్యు ఒడికి చేర్చి భయపెడుతోంది. జూలై నుంచి సెప్టెంబర్ నెల వరకూ వందల సంఖ్యలో కేసులు నమోదైనా ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. విజయనగరం జిల్లా గుర్ల మండలంలోని పెనుబర్తి గ్రామానికి చెందిన రొంగలి శేషగిరిరావు (51) సెప్టెంబర్ 20వ తేదీన డయేరియాకు గురయ్యాడు. వాంతులు విరేచనాలతో ఆ మర్నాడే చనిపోయాడు. అతను కిడ్నీలు పాడయి పోయి చనిపోయాడనే అందరూ భావించారు. తర్వాత అక్టోబర్ 1వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గంలోని పాచిపెంట మండలం విశ్వనాథపురంలో 27 మందికి డయేరియా సోకింది. వారిలో ఇద్దరు లెంక బంగారమ్మ (78), పడాల సీతన్న (65) మూడో తేదీన గ్రామంలోనే చనిపోయారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆ గ్రామానికి వెళ్లిన తర్వాత ఆ ఇద్దరు మరణాల విషయం వెలుగులోకి వచ్చింది. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అప్పటివరకూ పట్టించుకోలేదు. ఆ మంత్రితో పాటు జిల్లా ఉన్నతాధికారులు కూడా 5వ తేదీన అక్కడికి వెళ్లారు. టీడీపీ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఈ ఘటన అద్దం పడుతోంది.

- విజయనగరం జిల్లాలో దసరా పండగ రోజు నుంచి డయేరియా విజృంభించింది. జిల్లా కేంద్రానికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుర్ల మండల కేంద్రం వణికిపోయింది. పెనుబర్తి, కోటగండ్రేడు, గోషాడ, నాగల్లవలస, కెల్ల, గూడెం, గరికివలసకు డయేరియా పాకింది. ఇప్పుడు గరివిడి మండలంలోని దుమ్మెద, కోడూరు, జగన్నాథపురం, దువ్వాం, కందిపేట, శివరాం, గజపతినగరం మండలంలోని కెంగువ, దత్తిరాజేరు మండలంలోని గుచ్చిమి, దాసుపేట, కన్నాం గ్రామాల్లో డయేరియా కేసులు నమోదవుతున్నాయి. ఒక్కో గ్రామానికి ఈ మహమ్మారి విస్తరిస్తూ పోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లే వ్యవహరిస్తోంది. అతిసార వ్యాధిని అరికట్టలేక పాలకులకు నీరసం వచ్చిందేమోనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'ఒక్కటే' పాట....

దసరా రోజునే కోటగండ్రేడు గ్రామంలో రెండు డయేరియా కేసులు నమోదయ్యాయి. తర్వాత మూడురోజుల్లో 30 మంది వరకూ దీని బారినపడ్డారు. అధికారులు తేరుకొని 13వ తేదీన స్థానిక వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అయినా రోగుల్లో పరిస్థితి విషమంగా ఉన్న మరడాన అప్పలనర్సయ్యమ్మ (55)ను తొలుత గుర్ల పీహెచ్‌సీకి పంపించారు. అక్కడి నుంచి విజయనగరం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. 15వ తేదీన ఆమెను విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. ఆమె 17వ తేదీన చనిపోయింది. అధికారులు ఆమె ఒక్కరి మరణాన్నే డయేరియా కేసుగా చెబుతున్నారు. అంతకుముందు పెనుబర్తిలో చనిపోయిన శేషగిరిరావు మృతిని కానీ, గుర్లలో ఎనిమిది మంది, కోటగండ్రేడులో ఒకరు, నాగల్లవలసలో ఇద్దరూ చనిపోయినా అవేవీ డయేరియా మరణాలు కాదని, అంతకుముందే వివిధ అనారోగ్యాలతో ఉన్నవారు డయేరియా సోకడం వల్ల ఆరోగ్య పరిస్థితి విషమించి చనిపోయారని అధికారులు చెప్పుకొచ్చారు. జిల్లాకు చెందిన కొండపల్లి శ్రీనివాస్ కానీ, జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ కానీ అదే వాదనను వినిపించారు. ఈనెల 21న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గుర్ల గ్రామంలో పర్యటించారు. తర్వాత కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అయితే తన దృష్టికి వచ్చిన పది మృతుల కుటుంబాలకు తాను సొంతంగా రూ.లక్ష చొప్పున సాయం అందిస్తానని హామీ ఇవ్వడంతో మృతుల సంఖ్య చర్చనీయాంశమైంది.



చీపురుపల్లి సీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న డయేరియా బాధితులు

విచారణాధికారి తేల్చిందేమిటో...

ప్రభుత్వం గుర్ల విషాదంపై విచారణకు నియమించిన సీనియరు ఐఏఎస్ అధికారి విజయానంద్ ఈనెల 22న గుర్లలో పర్యటించారు. సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్లో విచారణ జరిపారు. ఆ వివరాలే బయటకు వెల్లడికాలేదు. డయేరియా విజృంభణకు బాధ్యులు ఎవరనీ కానీ, మృతులు సంఖ్య ఎంతని కానీ, కనీసం డయేరియా విజృంభణకు కారణాలేమిటనేదీ ఏమీ బయటపెట్టలేదు. ఆయన నేరుగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఆ నివేదిక ప్రకారమే మృతులు ఎంత మంది అనేదీ తేల్చి ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని పవన్ కళ్యాణ్ అంతకుముందే విజయనగరం కలెక్టరేట్లో వెల్లడించారు.

కూటమి ప్రజాప్రతినిధులకు పట్టలేదు..

గుర్ల మండల కేంద్రంలో దసరా రోజున పది మంది డయేరియా బారినపడ్డారు. వారిలో చింతపల్లి అప్పారావు (60) గుర్ల పీహెచ్‌సీలో వైద్యం పొంది రాత్రి ఇంటికి వచ్చేశాడు. మర్నాడు ఇంటి దగ్గరే చనిపోయాడు. తర్వాత కేసులు అధికమయ్యాయి. వారిలో ఎక్కువ మందిని గుర్ల పీహెచ్‌సీ నుంచి విజయనగరం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేసేశారు. అక్కడి నుంచి ఇద్దరిని కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కలిశెట్టి సీతమ్మ (50) ఈనెల 15వ తేదీన చనిపోయారు. అదే రోజు గుర్లలో సారిక పెంటయ్య (65), తోండ్రంగి రాము (50, మహిళ), గుమ్మిడి పైడమ్మ (66) ఇళ్ల దగ్గరే చనిపోయారు. ఈ ముగ్గురు గుర్ల పీహెచ్‌సీలోనే వైద్యం పొంది ఇళ్లకు వచ్చిన తర్వాత పరిస్థితి విషమించడంతో ప్రాణాలు కోల్పోయారు. అప్పటికి కానీ ప్రభుత్వం కళ్లు తెరవలేదు. ఆ మర్నాడు గుర్ల మండల కేంద్రంలోనే హైస్కూల్‌లో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 22 మంది డయేరియా బాధితులను 16వ తేదీన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పరామర్శించారు. తర్వాత గుర్ల గ్రామానికి వెళ్లారు. ఆ తర్వాతే జిల్లా కలెక్టరు బీఆర్ అంబేడ్కర్ తొలిసారిగా గ్రామానికి వచ్చారు. అదే రోజు సాయంత్రం స్థానిక చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు గుర్ల వైద్య శిబిరానికి వెళ్లడం గమనార్హం. ఆ మర్నాడు 17వ తేదీన జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తొలిసారిగా గుర్ల గ్రామానికి వచ్చారు. ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి వచ్చి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఆ తర్వాత కూడా డయేరియా కేసులు ఆగలేదు. అంతేకాదు ఈనెల 15వ తేదీన డయేరియాతో కేజీహెచ్‌లో చనిపోయిన సీతమ్మ కుటుంబంలో మరో విషాదం నెలకొంది. తల్లి మరణంతో మనోవేదనకు గురైన సీతమ్మ కుమారుడు కలిశెట్టి రవి (28) 18వ తేదీన చనిపోయాడు. ఆ రోజునే మళ్లీ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గుర్ల వైద్య శిబిరాన్ని సందర్శించారు. అక్కడ పాఠశాలలో విద్యార్థుల బెంచీలపై పడుకోబెట్టి డయేరియా రోగులకు వైద్యం చేయడమేమిటని వారు ప్రశ్నించారు. ఇదే విషయాన్ని వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తప్పుబట్టారు. 20వ తేదీన శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ గుర్ల పీహెచ్‌సీకి వచ్చి రోగులతో మాట్లాడారు. అదే రోజు రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్ అట్టాడ సిరి గుర్ల పీహెచ్‌సీని పరిశీలించారు.

తూతూమంత్రంగా పవన్ పర్యటన...

డయేరియా విషయంలో ప్రభుత్వ వైఫల్యంపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈనెల 21వ తేదీన పవన్ కళ్యాణ్ గుర్లలో పర్యటించారు. గుర్ల పీహెచ్‌సీలో ఏడుగురు పేషెంట్లతో మాట్లాడారు. తర్వాత గుర్ల గ్రామంలో రామమందిరం దగ్గర వేదికపై డయేరియా మృతుల కుటుంబాలతో మాట్లాడారు. అదంతా తూతూమంత్రంగానే సాగింది తప్ప బాధితులకు ఊరటనివ్వలేదు.

వ్యాప్తిచెందుతున్న వ్యాధి..

గుర్ల మండలంలో కొత్త కేసులు లేవనే సాకుతో హైస్కూల్‌లో వైద్య శిబిరాన్ని ఈనెల 22న మూసేశారు. ఆ రోజు నుంచి ఒకరూ ఇద్దరూ డయేరియా బారినపడుతున్నా అధికారికంగా 'జీరో' కేసులు చూపిస్తున్నారు. నాగల్లవలసలో డయేరియా బాధితులను తెట్టంగి పీహెచ్‌సీకి పంపించేసి అక్కడి శిబిరాన్ని మూసేశారు. ప్రస్తుతం గుర్ల పీహెచ్‌సీలో నలుగురు, తెట్టంగి పీహెచ్‌సీలో నలుగురు చికిత్స పొందుతున్నారు. ఈనెల 22న గరివిడి మండలంలోని కోడూరు, తుమ్మెద, జగన్నాథపురం, దువ్వాం, కందిపేట, శివరాం గ్రామాలకు చెందిన 17 మంది డయేరియా బారినపడ్డారు. వారు చీపురుపల్లి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. అలాగే 21వ తేదీన కెంగువ గ్రామంలో ఎనిమిది మందికి డయేరియా సోకింది. ఆ గ్రామంలో 22వ తేదీన వైద్య శిబిరం పెట్టారు. దత్తిరాజేరు మండలంలో గుచ్చిమి గ్రామంలో ఇద్దరికి, దాసుపేట గ్రామంలో ఒకరికి, కన్నాం గ్రామంలో ఒకరికి డయేరియా వచ్చింది. ఇలా విస్తరిస్తూనే ఉంది.

ప్రభుత్వాస్పత్రుల్లో నమోదైన డయేరియా కేసుల వివరాలు ఇలా..

క్రసం.	ప్రభుత్వ ఆస్పత్రి	చేరిన వారు	ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారు	డిశ్చార్జ్ అయినవారు	రిఫర్	మృతులు
1	విజయనగరం జీజీహెచ్	70	19	41	10	00
2	నెల్లిమర్ల సీహెచ్‌సీ	50	02	40	08	00
3	చీపురుపల్లి సీహెచ్‌సీ	101	30	57	13	01
4	గజపతినగరం సీహెచ్‌సీ	15	11	04	00	00
5	గుర్ల పీహెచ్‌సీ + వైద్యశిబిరం	242	04	191	40	07
6	తెట్టంగి పీహెచ్‌సీ	45	01	43	00	01
7	విశాఖ కేజీహెచ్	10	00	08	00	02
	మొత్తం	533	67	384	71	11

(జిల్లాలో మొత్తం 533 మంది డయేరియా బారిన పడగా 11 మంది మృతిచెందారు. మరో ముగ్గురు ఆస్పత్రుల్లో చేరకుండానే మృతి చెందారు. గుర్లలో ఇంటి వద్దే ఇద్దరు, విజయనగరం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాగళ్లవలసకు చెందిన మరొకరు మృతి చెందారు.)

నేడు వైఎస్ జగన్ రాక

- గుర్లలో డయేరియా బాధితులకు పరామర్శ



సాక్షి ప్రతినిధి, విజయనగరం: డయేరియాతో మృతి చెందినవారి కుటుంబాలను, ఆ వ్యాధి బాధితులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసినట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 9:30 : తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బయల్దేరతారు.
- 11:05: గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేట గ్రామంలోని దత్తా ఎస్టేట్‌లోనున్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11:15: దత్తా ఎస్టేట్ నుంచి గుర్ల గ్రామానికి బయల్దేరతారు
- 11:25: గుర్ల గ్రామానికి చేరుకుంటారు.
- 11:30: నుంచి మధ్యాహ్నం ఒంటిగంట: డయేరియా మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. డయేరియా బాధిత కుటుంబాలతో మాట్లాడతారు.
- 1:00: గుర్ల నుంచి దత్తా ఎస్టేట్‌కు బయల్దేరతారు
- 1:20: దత్తా ఎస్టేట్ నుంచి హెలికాప్టర్‌లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు వెళతారు

రాష్ట్రంలో రావణకాష్టం

- అదుపుతప్పిన శాంతి భద్రతలు
- మహిళలకు రక్షణ కరువు
- ప్రజల ఆరోగ్యాన్ని కాపాడలేకపోతున్న సర్కారు
- నాలుగునెలలకే చేతులెత్తేసిన టీడీపీ కూటమి
- విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన, డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: రాష్ట్రంలో రావణకాష్టం కనిపిస్తోంది.. ఓ వైపు ప్రజలు వ్యాధులు బారిన పడి పిట్టలా రాలిపోతున్నారు.. టీడీపీ కూటమి కార్యకర్తలు మహిళలు, ఆడపిల్లలపై హత్యలు, అత్యాచారాలకు తెగబడుతున్నారు.. అక్రమాలపై ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలపై దాడులుచేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మండిపడ్డారు. రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్‌తో కలిసి బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగుతోందన్నారు.

మహిళలపై హత్యలు, లైంగిక దాడులు జరుగుతుంటే ప్రభుత్వం నిద్రపోతోందని దుయ్యబట్టారు. ఇసుక మాఫియా పెరిగిపోయిందని, ప్రధానంగా రాజాం నియోజకవర్గంలో అత్యధికంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపించారు. మద్యం దుకాణాలు ప్రైవేట్ వ్యాపారులకు ఇచ్చి, ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. తల్లికి వందనం పథకాన్ని పక్కన పెట్టి 'నాన్నకు మద్యం ఇంధనం' ఇచ్చే పనిలో చంద్రబాబు సక్సెస్ అయ్యారని విమర్శించారు. గుర్ల మండలంలో డయేరియా మరణాలపై అటు అధికారులు, ఇటు డిప్యూటీసీఎం పొంతనలేని సమాధానాలు చెప్పడం విచారకరమన్నారు. పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగంలో పాత్ర పోషిస్తూ ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని, అధికార పార్టీ నేతల తప్పుడు కేసులకు ఊతమిస్తున్నారని ఆరోపించారు. తలే రాజేష్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పాలన చేతకాక నాలుగు నెలలకే సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కళ్యాణ్ చేతులెత్తేసారని విమర్శించారు. పాలనపై ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, గురుగుబెల్లి స్వామినాయుడు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, టంకాల అచ్చెన్నాయుడు, వాకముల్ల చిన్నంనాయుడు, కోనారి అప్పారావు, కొర్ను ఈశ్వరరావు, పాగిరి లెనిన్, డాక్టర్ మాధవీలత, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల నుంచి కేజీ కందిపప్పు పంపిణీ

- జిల్లా సివిల్‌సప్లై అధికారి మధుసూదనరావు

బొబ్బిలిరూరల్: రేషన్‌కార్డుదారులందరికీ నవంబర్ నెల నుంచి కిలో కందిపప్పు, అరకిలో పంచదారను సరఫరా చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.మధుసూదనరావు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమంగా తరలిస్తున్న 800 క్వింటాళ్ల రేషన్ బియ్యంను సీజ్‌చేసి 30 మందిపై కేసులు నమోదుచేశామన్నారు. కొత్తగా 42 రేషన్ డిపోల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు వెల్లడించారు. జిల్లాలో 5,31,646 రేషన్ కార్డుదారులుండగా 1249 రేషన్ డిపోల ద్వారా 370 ఎండీయూ వాహనాలతో ప్రజలకు రేషన్ సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. 135 రైస్ మిల్లులున్నాయని, వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ పి.రవికుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

ఇదెక్కడి అన్యాయం సారూ..!



ఎల్.కోట వెలుగు కార్యాలయం వద్ద హైకోర్టు ఆర్డర్ కాపీని చూపుతున్న మహిళ పేరు ద్వారపూడి ఉమ. ఎల్.కోట మండలంలోని సీతారామపురం గ్రామం. ఇందిరా క్రాంతిపథంలో భాగంగా వెలుగు కార్యాలయంలో సీతారామపురం గ్రామ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ)గా సుమారు పేదేళ్లుగా పని చేస్తున్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒత్తిడి మేరకు ఆమెను జూన్ 27వ తేదీన విధుల నుంచి తొలగించారు. తనకు జరిగిన అన్యాయంపై ఆమె హైకోర్టు తలుపుతట్టారు. ఆమె పిటీషన్‌ను పరిశీలించిన హైకోర్టు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆగస్టు 21వ తేదీన ఆర్డర్ జారీ చేసింది. సంబంధిత కాపీని కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ, వెలుగు ఏపీడీ, ఏపీఎం తదితర అధికారులకు రిజిస్టర్ పోస్టు చేశారు. అయినా ఏ ఒక్క అధికారి కూడా పంట్టించుకోలేదు. ఆమె విధులను గ్రామానికి చెందిన వేరొకరితో అధికారులు చేయించుకుంటున్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని స్థానిక విలేకరులకు వివరిస్తూ వెలుగు కార్యాలయం వద్ద ఉమా బుధవారం కన్నీరుపెట్టారు. ఇదే విషయాన్ని వెలుగు అధికారుల వద్ద ప్రస్తవించగా... విధుల్లోకి తీసుకుంటామని చెబుతూనే... మా చేతుల్లో ఏముంది.. అంతా పాలకుల దయే అంటూ బదులిచ్చారు.

– ఎల్.కోట

చెరకుతోటలు దగ్ధం



బొడ్డవలసలో అగ్నికి ఆహుతైన చెరకుపంట

రేగిడి: మండలంలోని బొడ్డవలస గ్రామంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో చెరకు తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన మజ్జి సాంబమూర్తి చెరకుతోటపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ సరఫరా తీగలు రాపిడికి గురై నిప్పులు రావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. ఈ ప్రమాదంలో సాంబమూర్తితో పాటు ఆలుబిల్లి శ్రీను, దుర్గారావు, మజ్జి కృష్ణ, తూతిక మాధవ తదితర రైతులుకు చెందిన ఐదు ఎకరాల్లోని చెరకు తోటలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్సై సర్వేశ్వరరావుతో కలిసి మంటలను అదుపుచేశారు. రూ.2 లక్షల వరకూ పంట నష్టం ఉంటుందని అంచనా వేశారు.

పోలీసులమంటూ బెదిరింపులు

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలికి చెదిన తెర్లాం మండల ఉపాధ్యాయుడు మింది విజయమోహన రావు త్రుటిలో సైబర్ మోసం నుంచి తప్పించుకున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం ఆయన కుమారుడు విదేశాల్లో ఉన్నాడు. కుమారుడి ద్వారా హవాలా సొమ్ము విజయమోహన రావుకు వస్తోందని, డిజిటల్ అరెస్టు చేస్తామని పోలీసుల పేరుతో నకిలీ వ్యక్తులు ఆయనకు ఫోన్‌చేశారు. పోలీసులకు సమాచారం ఇస్తానన్న ఆయన మాటలు విని అవతలి వారు ఫోన్ కట్ చేశారు. ఈ మేరకు అన్ని ఆధారాలతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా రేపు

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 25న హెటిరో డ్రగ్స్, యంగ్ ఇండియా, పేటీఎం తదితర బహుళజాతి పరిశ్రమల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణా రావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ,డిగ్రీ ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు ఏపీ నైపుణ్యాభివృద్ధిసంస్థ వెబ్ సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, సంబంధిత రిఫరెన్స్ నంబర్‌తో ఈనెల 25న అన్ని సర్టిఫికెట్లు, ఫొటోలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9618792572, 9988853335లను సంప్రదించాలని సూచించారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹132	₹234	₹244

తిన్నది కక్కాల్సిందే..!

- ఉపాధి నిధుల వాడకంపై డ్వామా అధికారులు
- రికవరీ చేయాల్సిన నిధులు రూ.2.91 కోట్లు
- ఇంతవరకు రూ.1.48 కోట్లు వసూలు



గంట్యాడ మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రవేశ పెట్టారు. అయితే అది కొంతమంది అక్రమార్కులకు వరంగా మారింది. ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు పాల్పడి అందిన కాడికి దోచుకున్నారు. సోషల్ ఆడిట్ (సామజిక తనిఖీ)లో సిబ్బంది అక్రమాలు బయటపడ్డాయి. దీంతో వారు తిన్న సొమ్మును కక్కించేందుకు డ్వామా (జిల్లా నీటియాజమాన్య సంస్థ) అధికారులు రికవరీ అస్త్రాన్ని ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే కొంతమేర వసూలు చేశారు. మిగతాది కూడా వసూలు చేసేందుకు సిబ్బందికి రికవరీ నోటీసులు ఇచ్చారు. ఉన్న ఊళ్లో పనులు లభించడంతో గ్రామాల్లోనే పనులు చేసుకుంటూ వేతనదారులు జీవనం సాగిస్తున్నారు.గ్రామంలో జరిగిన ఉపాధి పనులు, మెటీరీయల్ పనులపై సోషల్ ఆడిట్ సిబ్బంది ప్రతి ఏటా సామాజిక తనిఖీ నిర్వహిస్తారు. మండలస్థాయిలో నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావేదికలో గ్రామస్థాయిలో గుర్తించిన వివరాలను అధికారులకు అందజేస్తారు. మండలాల్లో సామాజిక తనిఖీ ప్రజావేదికసభలు అయిన తర్వాత జిల్లాస్థాయిలో చివరిగా నిర్వహిస్తారు. సోషల్ ఆడిట్ సిబ్బంది ఎవరి నుంచి ఎంత రికవరీ చేయాలన్న వివరాలను డ్వామా అధికారులకు అందజేస్తారు. వాటి ఆధారంగా సిబ్బంది నుంచి డ్వామా అధికారులు రికవరీ చేస్తారు.

2.91కోట్లు రికవరీ చేయాల్సి ఉంది

ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్స్) సాంకేతిక సహాయకులు (టెక్నికల్ అసిస్టెంట్స్) ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ (ఈసీ), కంప్యూటర్ ఆపరేటర్స్, ఏపీఓలు క్షేత్ర స్థాయిలో పనిచేస్తుంటారు. సోషల్ ఆడిట్ సిబ్బంది రికవరీకి సూచించింది కూడా ఈ కేడర్ల వారినే. జిల్లా వ్యాప్తంగా రూ. 2.91 కోట్లు రికవరీ చేయాలని సోషల్ ఆడిట్ సిబ్బంది సూచించారు. ఇప్పటి వరకు రూ.1.48కోట్లు రికవరీ చేశాం. ఇంకా 1.43 కోట్లు మిగిలి ఉంది. ఇందులో ఆర్‌ఆర్ యాక్ట్ కింద రూ.కోటి, సిబ్బంది నుంచి రూ. 43 లక్షలు రికవరీ చేయాల్సి ఉంది.

సిబ్బంది జీతాల నుంచి రికవరీ

ఉపాధి హామీ సిబ్బంది కట్టాల్సిన సొమ్మును వారి జీతాల నుంచి అధికారులు రికవరీ చేస్తున్నారు. ఇప్పటికే సిబ్బంది నుంచి చాలావరకు డ్వామా అధికారులు రికవరీ చేశారు.

ఇంకా వసూలు చేయాల్సి ఉంది

సిబ్బంది నుంచి రికవరీ చాలా వరకు చేశాం. మిగతాది కూడా ప్రతి నెలా రికవరీ చేస్తున్నాం. రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద రూ.కోటి, సిబ్బంది నుంచి రూ. 43 లక్షలు రికవరీ చేయాల్సి ఉంది.

ఇ.సందీప్, డ్వామా పీడీ

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి, ఐదవ విడతలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు పట్టణ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అభ్యర్థి నేరుగా ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న తరువాత అభ్యర్థి దరఖాస్తు చేసిన ఐటీఐ కళాశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకుని వెళ్లి వెరిఫికేషన్ ప్రాసెస్ పూర్తిచేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలలో ఈ నెల 28న, ప్రైవేట్ ఐటీఐలలో ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు.

ధాన్యం విక్రయాలకు ఈకేవైసీ తప్పనిసరి



చీకటిపేటలో జిల్లేడు కషాయం తయారీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు

- జిల్లా వ్యవసాయాధికారి రామారావు

తెర్లాం: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు అన్నారు. మండలంలోని చీకటిపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే రైతులు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని, ఈకేవైసీ లేని రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేమని స్పష్టం చేశారు. ఈ నెల 24, 25 తేదీల్లో తుపాను వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరిపంట కోతలను నిలుపుదల చేయాలని, సస్యరక్షణ చర్యలు, ఎరువులు వేయడం ఆపాలన్నారు. తుపాను వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ప్రకృతివ్యవసాయంపై మక్కువ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ జి.సునీల్ కుమార్, చీకటిపేట సర్పంచ్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు సిద్ధంగా క్రీడా మైదానం



మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

సీతానగరం: రాష్ట్రస్థాయి విలువిద్య(ఆర్చరీ) పోటీలను సీతానగరం మండలంలోని జోగింపేటలో నిర్వహించనున్న సందర్భంగా క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్నామని పార్వతీపురం మన్యం డీఈఓ పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు మండలం లోని జోగింపేట డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో క్రీడలకు సిద్ధం చేస్తున్న క్రీడామైదానాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబరు 3,4,5 తేదీలలో 13 ఉమ్మడి జిల్లాల ఉన్నత పాఠశాలలకు చెందిన 600 మంది క్రీడాకారులకు జోగింపేట క్రీడా మైదానంలో జిల్లా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.మురళి, ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శి డీటీ గాంధీ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కొమరాడ వాసి మృతి

- విశాఖ జిల్లాలో ప్రమాదం



ఘటనా స్థలంలో మృతి చెందిన వెంకటనాయుడు, క్షతగాత్రుడు వెంకటేష్



వెంకటనాయుడు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: మేనల్లుడికి సంబంధించి అమ్మవారి పూజలో పాల్గొని తిరిగి వెళ్తున్న అతని మేనమామ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. దీనిపై విశాఖ జిల్లా గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక ప్రాంతం జోగువానిపాలెంలో ఉంటున్న ఏదురు వెంకటేష్ భవానీ మాలవేశాడు. బుధవారం పూజ అనంతరం భిక్ష కార్యక్రమానికి పార్వతీపురం జిల్లా కొమరాడకు చెందిన మేనమామ కోండ్రు వెంకటనాయుడి(54)ని ఆహ్వానించాడు. ఈ కార్యక్రమానికి హాజరైన వెంకటనాయుడు తిరుగు ప్రయాణంలో కంచరపాలెంలోని తన బంధువులను కలుసుకోవడానికి వెంకటేష్‌తో కలిసి స్కూటీపై బయల్దేరాడు. స్కూటీపై పూజాసామగ్రితో గాజువాక నుంచి ఎన్‌ఏడీ వైపు వేగంగా వెళ్తూ..ఎయిర్‌పోర్టు సమీపంలో వంతెన వద్ద అదుపుతప్పి డివైడర్‌ను స్కూటీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న వెంకటనాయుడు రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. స్కూటీ నడుపుతున్న వెంకటేష్ చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వెంకటేష్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వెంకటనాయుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

గజపతినగరం: విజయనగరం మహారాజా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి బుధవారం చెందాడు. ఈ మేరకు గజపతినగరం ఎస్సై కె.లక్ష్మణరావు తెలియజేసిన వివరాల ప్రకారం గజపతినగరం మండలంలోని మదుపాడ గ్రామం సమీపంలో ఈనెల15వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి పడిపోవడంతో విజయనగరం మహరాజా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించే ఏర్పాటు చేశారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మదుపాడ వీఆర్‌ఓ కె.విష్ణుమూర్తి ఇచ్చిన సమాచారం మేరకు కేసును నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, వివరాలు తెలిసినవారు తమను సంప్రదించాలని మహరాజా ఆస్పత్రిలో మృతదేహాన్ని ఉంచినట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య..



రమేష్ మృతదేహం

వంగర: మండల పరిధి అరసాడ గ్రామానికి చెందిన గాడి రమేష్(31) పురుగుమందు తాగి బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు హెచ్‌సీ వావిలపల్లి రామకృష్ణ తెలిపారు. కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగిన రమేష్‌ను కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో జీఎంఆర్ రక్షలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడని, తండ్రి అప్పలసూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వెల్లడించారు.

నెలాఖరు వరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో చేపడుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నెలాఖరు వరకు కొనసాగించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వైద్యాధికారులు, ఇతర మండల అధికారులతో బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌పై సమీక్షించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు, క్లోరినేషన్, ఇంటింటి ఆరోగ్య సర్వే పై ఆరా తీశారు. ప్రతిరోజూ ఈ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు దండోరా లేదా ఇతర మార్గాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీటి ట్యాంకులు శుభ్రంచేసి నీటిని నింపేటప్పుడు తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రతిగ్రామంలో తాగునీటి ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్, నీటి పరీక్షలు నిర్వహించేటప్పుడు మూడు వేర్వేరు రిజిస్టర్లలో తేదీ, ఇతర వివరాలను నమోదు చేసి, సర్పంచ్ లేదా ఇతర ప్రజాప్రతినిధుల సంతకం చేయించాలని, పనుల వివరాలను ఫొటోలతో సహా ఈఓపీఆర్డీకి పంపించాలని ఆదేశించారు. ఈ నెలాఖరు వరకు యంత్రాంగమంతా స్పెషల్ డ్రైవ్‌లో నిమగ్నమై ఉండాలని స్పష్టంచేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డీఆర్వో ఎస్.డి.అనిత, సీపీఓ పి.బాలాజీ, జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ విద్యాదీవెన విడుదల చేయాలి

- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్‌బాబు

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతి దీవెన రూ.1400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విజయనగరంలోని అమర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు సంబంధించి నాలుగు క్వార్టర్ల రూపంలో డబ్బులు జమ అయ్యేవని, గత సంవత్సరం విద్యార్థులకు కేవలం ఒక క్వార్టర్ మాత్రమే విడుదలై మిగతా మూడు క్వార్టర్లు విడుదల కాలేదన్నారు. రాష్ట్రంలో దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ ఇంజినీరింగ్ పీజీ విద్యను అభ్యసిస్తున్నారు. దానిలో ఒక క్వార్టర్ ఫీజులు రూ.708 కోట్లు విడుదల చేశారు.మూడు క్వార్టర్లకు సంబంధించి దాదాపు రూ.2100 కోట్లు విడుదల చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్,వసతి దీవెన డబ్బులు విడుదల చేయకుండా విద్యార్థులకు కోర్సులు అయిపోయినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యులు, ఇబ్బంది పెడుతున్నాయని, ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులకు షరతులు పెడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రియింబర్స్‌మెంట్, వసతి దీవెనకు అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి పరీక్షలు రాసేందుకు అనుమతించాలని, అదేవిధంగా వారి సర్టిఫికెట్లు కూడా అందజేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం సహాయ కార్యదర్శులు పి.గౌరీ శంకర్, దుర్గ, ఉపాధ్యక్షుడు ఎ.సుమన్ నాయకులు భాను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి మొండిచేయి

- ఎస్‌ఎఫ్‌ఐ మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: అమరావతిలో జరిగిన మంత్రిమండలి నిర్ణయాలలో కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని చర్చకు తీసుకురాకపోవడం దుర్మార్గమైన విషయమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేశ్‌లు మండిపడ్డారు. ఈ మేరకు స్థానిక ఎల్‌బీజీభభవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో గత రెండు సంవత్సరాలుగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రియింబర్స్ మెంట్‌ను ఆపేసిందని దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించామన్నారు. అదే సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పోరాటం చేశారని తెలిపారు. ఈ పోరాటాన్ని గ్రహించిన ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో విద్యార్థులకు అండగా ఉంటామని, గత ప్రభుత్వం బాకీ పెట్టిన, అలాగే ఈ ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజులను కలిపి విద్యార్థులకు ఇచ్చే విధంగా కృషి చేస్తానని ప్రకటన చేయించిందని తెలిపారు. కానీ నేడు జరిగిన మంత్రి మండలి నిర్ణయాలలో విడుదల చేయాల్సిన స్కాలర్‌షిప్ నిధుల మీద ఎటువంటి స్పందన లేకపోవడం విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని విమర్శించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఎటువంటి నిర్ణయం వెలువడక పోతే జిల్లాలో విద్యార్థులు అందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని దీనికి జిల్లా విద్యా యంత్రాంగం, రాష్ట్రప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అకారణంగా అర్ధరాత్రి తిరిగితే కేసులు

- ఎస్పీ వకుల్ జిందాల్



వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: సహేతుకమైన కారణం లేకుండా అర్ధరాత్రి వేళ పట్టణాల్లో తిరిగితే టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదుచేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గడిచిన నాలుగు నెలల్లో ఇప్పటివరకు 450 మందిపై న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదుచేశామని, కౌన్సెలింగ్ ఇచ్చామని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో భాగంగానే రాత్రి గస్తీ, పెట్రోలింగ్‌లో మౌలిక మార్పులు చేపట్టామని తెలిపారు. పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మూడులాంతర్లు, కోట, బాలాజీ జంక్షన్, దాసన్నపేట రైతు బజార్, రింగురోడ్డు, కొత్తపేట, ఐస్ ఫ్యాక్టరీ, జమ్ము, వీటీ అగ్రహారం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాల్టీల్లో కొన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ పోలీసులు తనిఖీలు చేపడుతున్నారన్నారు. రాత్రి 11 గంటల తర్వాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకుంటూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేసినా, కారణాల్లేకుండా రోడ్లపై తిరిగినా కేసులు నమోదుచేయాలని ఆదేశించినట్లు స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించి, వారి వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే విడిచిపెట్టాలని పోలీస్ అధికారులకు తెలియజేశారు.

'అపార్'లో నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐఓ ఆదినారాయణ

- ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ

రాజాం సిటీ: జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాల విద్యార్థుల వివరాలను అపార్ (ఆటోమేటిడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)లో నమోదు చేయాలని ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా ఆధార్ తరహాలో ఉండే అపార్ కార్డు విద్యార్థులకు అందిస్తారని తెలిపారు. ఇందులో విద్యార్థి డేటా మొత్తం నిక్షిప్తమై ఉంటుందని పేర్కొన్నారు. త్వరితగతిన విద్యార్థుల డేటాను తప్పులులేకుండా పొందుపర్చాలని సూచించారు. ప్రతి అధ్యాపకుడు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుచేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది నుంచి ప్రైవేటు కళాశాలల అధ్యాపకులకు కూడా అవకాశం ఇచ్చారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కామేశ్వరరావు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.